క్లుప్తంగా

విద్యార్థుల కోసం బస్సు సర్వీసు



బస్సు వద్ద విద్యార్థులు

పీసీపల్లి: మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి విద్యార్థులకు రవాణా సమస్య తీరింది. వివరాల్లోకి వెళితే..లక్ష్మక్కపల్లి పంచాయతీలో దాదాపు 25 మంది విద్యార్థులు పెదయిర్లపాడు జెడ్పీ హైస్కూల్‌కు రావాల్సి వస్తుంది. అయితే బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడేవారు. విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీపీ అత్యాల జపన్య సహకారంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వెంటనే బస్సు సౌకర్యం కల్పించేలా చూడాలని డిపో మేనేజర్‌కు సూచించగా..వెంటనే సర్వీసు కేటాయించారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జగనన్న సురక్ష గ్రామసభలు

హనుమంతునిపాడు: మండలంలోని హెచ్‌ఎంపాడు, పెద్దగొల్లపల్లి సచివాలయాల పరిధిలో బుధవారం జగనన్న సురక్ష గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీఓ జీవీ కృష్ణారావు తెలిపారు. హనుమంతునిపాడులో ఎంపీడీఓ జీవీ క్రిష్టారావు బృందం, పెద్దగొల్లపల్లిలో తహసీల్దార్ ఎస్.హరిబాబు బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేడు జగనన్న సురక్ష

టంగుటూరు: మండలంలోని మర్లపాడు, ఎం.నిడమానూరు సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రత్నజ్యోతి తెలిపారు. వలంటీర్ల సర్వేలో గుర్తించిన సమస్యలు పరిష్కరించడంతోపాటు దరఖాస్తుదారులకు ఉచితంగా ధ్రువపత్రాలు అందిస్తామని ఎంపీడీఓ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంఈఓ-1గా చిరంజీవి



పీసీపల్లి: ఎంఈఓ–1గా జి.చిరంజీవి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కనిగిరి గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల సమస్యలు, నాడు- నేడు పనుల పురోగతి వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనుల ప్రారంభం

పీసీపల్లి: మండల పరిధిలోని గుంటుపల్లిలో గుంటుపల్లి- తురకపల్లి రోడ్డుకు మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉండేదని సర్పంచ్ పేరమ్మ తెలిపారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించారన్నారు. గ్రామస్తులతో కలిసి మంగళవారం రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి, తురకపల్లి ప్రజలు ఎమ్మెల్యే బుర్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌ఓ బెంజిమెన్‌కు సన్మానం



బెంజిమెన్‌కు సన్మానిస్తున్న ఎంపీడీఓ

వెలిగండ్ల: వీఆర్‌ఓ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పరిశపోగు బెంజిమెన్ ఎంపిక కావడంపై ఎంపీడీఓ టి.సుకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు టి.దేవసహాయం, యెలికె నారాయణ, సర్ను వెంకటేశ్వర్లు, రాజశేఖర్ అభినందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బెంజిమెన్‌ను ఘనంగా సన్మానించారు.

663 పొగాకు బేళ్లు కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం ఎం.నిడమానూరు, కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం, చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాల రైతులు 723 బేళ్లు తీసుకురాగా 663 కొనుగోలయ్యాయి. 60 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.245, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.227.69 పలికింది. వేలంలో మొత్తం 35 మంది వ్యాపారులు పాల్గొన్నారని ఎస్జీఓ సునీల్ కుమార్ తెలిపారు.



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

వలంటీర్లకు వందనం

సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించడం, ఆపద సమయాల్లో అండగా నిలవడం, ఒకటో తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతల తలుపుతట్టి పింఛను డబ్బు చేతికందించి వారి ఆశీస్సులు పొందడం.. ఇదీ వలంటీర్ల పని. వాస్తవానికి వలంటీర్లు చేస్తున్నది పనికాదు సమాజసేవ. కేవలం రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుంటున్న వలంటీర్లు కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రజలకు అండగా నిలిచి మన్ననలు పొందారు.

కరోనా సమయంలో అండగా నిలిచాడు



నా కుటుంబం కరోనా మహమ్మారి బారిన పడిన సమయంలో అనేక అగచాట్లుపడ్డాం. బంధువులు సైతం మా దగ్గర రాలేకపోయారు. బయటకు పోయే పరిస్థితి లేనందున ఇంట్లోనే ఉన్నాం. అలాంటి సమయంలో మా వలంటీర్ సాధు కిరణ్ ధైర్యంగా ముందుకు వచ్చి మా కుటుంబానికి నిత్యవసర సరుకులు తెచ్చి ఇచ్చాడు. తనకు మా నుంచి కరోనా సోకుతుందనే భయం లేకుండా సరుకులు, మంచినీళ్లు, మందులు సరఫరా చేసి మా కుటుంబానికి అండగా నిలబడ్డాడు. అలాంటి వలంటీర్లను కించపరుస్తూ పవన్‌కళ్యాణ్ మాట్లాడటం బాధగా ఉంది. నాకు రాజకీయాలతో సంబంధం లేదు. సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్న వలంటీర్లపై అసత్యాలు ప్రచారం చేయడం దురదృష్టకరం.

– కొప్పోలు రంగారావు, మంగపతివారిపాలెం, పొన్నలూరు

పింఛను ఇప్పించింది



రెక్కాడితేగానీ డొక్కాడని బతుకు నాది. భర్త చనిపోయిన తర్వాత పొట్టపోసుకోవడం కష్టంగా ఉంది. మా వలంటీర్ సునీత నా దగ్గరికి వచ్చి వితంతు పింఛను కోసం దరఖాస్తు చేయడానికి అవసరమైన పత్రాలు తీసుకెళ్లింది. ప్రభుత్వం పింఛను మంజూరు చేయడంతో ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికొచ్చి పింఛను ఇస్తోంది. ఆ సొమ్ముతోనే రోజూ నాలుగు ముద్దలు తింటున్నా. ఒకరి మీద ఆధారపడకుండా మందులు కొనుక్కుంటున్నా. జగన్ ప్రభుత్వం కలకాలం బాగుండాలి.

– అన్నపురెడ్డి జాలమ్మ, వాణినగర్, టంగుటూరు

వలంటీర్ వల్లే 'చేదోడు' లబ్ధిదారునయ్యా..



దివ్యాంగుడినైన నేను కుట్టు మిషన్ మీద ఆధారపడి జీవిస్తున్నా. జగనన్న చేదోడు పథకం దరఖాస్తులు తీసుకునే సమయంలో నేను మా ఊర్లో లేను. అయితే మా వలంటీర్ పూనూరి ధనలక్ష్మి ఫోన్ చేసి వెంటనే ఊరికి పిలిపించి దరఖాస్తు చేయించింది. అర్హుడిని కావడంతో ప్రభుత్వం లబ్ధిదారుగా గుర్తించి నా ఖాతాలో ఏటా రూ.10 వేలు జమ చేస్తోంది. గత ప్రభుత్వంలో పింఛను కోసం గంటలతరబడి నిలబడి విసుగెత్తిపోయేది. కానీ ఈ ప్రభుత్వంలో ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి తలుపుతట్టి పింఛను అందిస్తున్న వలంటీర్లపై తప్పుడు ప్రచారం చేయడం మంచిది కాదు.

– ఉప్పుటూరి శ్రీను, మర్రిపూడి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అశోక్‌బాబు, డాకా పిచ్చిరెడ్డి



కె.ఉప్పలపాడులో అశోక్‌బాబుకు పార్టీ శ్రేణుల ఘన స్వాగతం

అశోక్‌బాబుకు అపూర్వ స్వాగతం

కొండపి : గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా భారీ బైక్ ర్యాలీతో కొండపి మండలం కె.ఉప్పలపాడు చేరుకున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి అశోక్‌బాబు గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు.



కరపత్రాలు ఇచ్చి వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ధ్వజం

వెలిగండ్ల: గ్రామ వలంటీర్లపై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేసిన పవన్‌కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎంపీపీ రామన మహాలక్ష్మి డిమాండ్ చేశారు. వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వలంటీర్లు మంగళవారం ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సేవా దృక్పథంతో ఎటువంటి లాభాపేక్ష లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హుల చెంతకు చేరుస్తున్నారన్నారు. సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతి ఇంటి తలుపు తట్టి వారి యోగక్షేమాలు తెలుసుకొని వారికి సపర్యలు చేసిన ఘనత గ్రామ వలంటీర్లదేనన్నారు.జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి కుప్పనబోయిన పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు వై నాగూర్‌యాదవ్, టి.దేవసహాయం, యెలికె రమణయ్య, యెలికె నారాయణ తదితరులు పాల్గొన్నారు.



వెలిగండ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీపీ రామన మహాలక్ష్మి

పామూరు: వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు సిగ్గుచేటని వలంటీర్ల సంఘం నాయకులు సుబాని, మహమ్మద్‌గౌస్, కరిముల్లా పేర్కొన్నారు. వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రమైన పామూరులో వలంటీర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. పేదలకు అందే ప్రతిసేవలో నేడు వలంటీర్ కీలకపాత్ర పోషిస్తున్నాడని పవన్‌కల్యాణ్ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరిముల్లా, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

పీసీపల్లి: వలంటీర్లపై జనసేన అధినేత చేసిన వ్యాఖ్యలను బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి డిమాండ్ చేశారు. పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని వలంటీర్లతో కలసి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలను గాలికొదిలేసి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ హైదరాబాద్ పారిపోతే వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ధైర్యంగా ముందడుగు వేశారన్నారు. ఎంపీపీ అత్యాల జపన్య, జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, నాయకులు లింగాలదిన్నె నరసింహారెడ్డి, వలంటీర్లు ఉన్నారు



పామూరులో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



పీసీపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు, నాయకులు

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయండి

పామూరు: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశహాలులో ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ గంగసాని లక్ష్మి మాట్లాడుతూ అధికారుల తప్పిదాలు, విధుల్లో అలసత్వం వల్ల అటు ప్రభుత్వానికి ఇటు స్థానిక ప్రజాప్రతినిధులు విమర్శలకు గురికావాల్సి వస్తోందని, అధికారులు తీరుమార్చుకుని అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. పామూరు ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, కట్టకిందపల్లె సర్పంచ్ నీరుకట్టు వేణు, కంబాలదిన్నె సర్పంచ్ రమణమ్మ మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా ఉండటం, కొన్ని శిథిలావస్థకు చేరుకుని సరిగా లేకపోవడం, వీధిలైట్లు 24 గంటలు వెలుగుతూ ఉన్నాయని, ఈ సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసమావేశాల్లో ప్రశ్నించినా పరిష్కారం కావడం లేదని, సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకన్నారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ లక్ష్మి.. ప్రైవేట్ పనులు వేగంగా చేస్తున్నారని, ప్రభుత్వానికి చెందిన పనులుమాత్రం నత్తనడకన చేస్తున్నారని తీరు మార్చుకోవాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. వ్యవసాయాధికారి కంచెం రాధ, పశు వైద్యాధికారి ఈమని సాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, హౌసింగ్ ఏఈ రాజు వారి శాఖల నివేదికలు వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ వచ్చే మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నాటికి సమస్యలను పరిష్కారించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైస్ ఎంపీపీ ఏసురత్నం, ఎంపీడీఓ వి.శ్రీనివాసులు, కోఆప్షన్ నాయబ్‌రసూల్, విద్యుత్ ఏఈ జిలానీ, ఎంపీటీసీలు ఆకుపాటి వెంకటేష్, అబ్దుల్, నాయబ్, రాఘవేంద్ర, పోలినేని శ్రీను, రెక్కల అనితారెడ్డి, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖపై సమీక్షిస్తున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

అక్రమంగా విద్యుత్ వాడితే చర్యలు

కొండపి: అక్రమంగా విద్యుత్ వాడితే కఠిన చర్యలతోపాటు జరిమానా విధిస్తామని ఆ శాఖ కొండపి ఏఈ కె.కోటయ్య హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జిల్లా విజిలెన్స్ అధికారులు మంగళవారం 33 బృందాలుగా ఏర్పడి 23 గ్రామాల్లో 2,475 సర్వీసులను తనిఖీ చేసినట్లు ఏఈ తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 119 సర్వీసులను గుర్తించి రూ.4,33,000 జరిమానా విధించినట్లు తెలిపారు. జిల్లా విజిలెన్స్ అధికారి తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కందుకూరు డివిజన్ విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నట్లు ఏఈ తెలిపారు.



సిబ్బందికి సూచనలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి

సీఎస్‌పురం(పీసీపల్లి): పాఠశాలల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఉప్పలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధన గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. జగనన్న గోరుముద్దలో భాగంగా అందిస్తున్న రాగిజావను రుచి చూశారు. సచివాలయ కన్వీనర్ బొర్రాజు రమణయ్య, ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్ రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

82 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల్లో భాగంగా హనుమంతాపురం గ్రామంలో నిర్వహించిన శిబిరంలో 82 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసి సూచనలు చేశారు. డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కారు అద్దం పగలగొట్టి రూ.2.14 లక్షలు చోరీ

సింగరాయకొండ: కారు అద్దాలు పగలగొట్టి రూ.2.14 లక్షల నగదు చోరీ చేసిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం కనుమళ్ల గ్రామ సచివాలయం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సోమరాజుపల్లి పంచాయతీ పకీరుపాలెంలోని బ్రాహ్మణ కాలనీలో నివసిస్తున్న నల్లావుల రవి తన ఇంటి వద్ద నుంచి రూ.5.14 లక్షలు తీసుకుని కారులో బయలుదేరారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లోని ఏపీజీబీలో రూ.3 లక్షలు డిపాజిట్ చేసి, మండల పరిషత్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దకు వెళ్లారు. అనంతరం కనుమళ్ల గ్రామ సచివాలయం వద్ద కారు నిలిపి కార్యాలయం లోపలికి వెళ్లి సుమారు 15 నిమిషాల తర్వాత బయటకు రాగా కారు అద్దం పగిలి ఉండటం గమనించారు. రూ.2.14 లక్షలు చోరీ అయ్యాయని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై టి.శ్రీరామ్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కారును పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

పామూరు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని నుచ్చుపొద సచివాలయం పరిధిలోని తిరగలదిన్నెలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బుర్రా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు తమకు పింఛన్ వస్తూ నిలిచిపోయిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా..సచివాలయ సిబ్బంది, వలంటీర్లను పిలిచి పింఛన్ నిలిపివేతకు కారణాలు తెలుసుకొని సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి మొదలుకుని వార్డు సభ్యునివరకు తాము పేదప్రజల సంక్షేమానికే పనిచేస్తున్నామని తమకు పార్టీ, కులం, మతం లేదన్నారు. చిన్నపాటి లోపాలు ఉన్నా వాటిని తక్షణం సరిదిద్ది పథకాలు అందేలా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి పేరుప్రతిష్టలు తేవడంతోపాటు మీరు ప్రజా మన్ననలు పొందాలని సూచించారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం తిరగలదిన్నె గ్రామంలో పండుగలా సాగింది. కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ పుట్లూరి పిన్నిక వెంకటరమణమ్మ, దారపనేని కొండబాబు, ఎంపీటీసీ బొట్లా నాగార్జున, గోళ్ల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ యేసురత్నం, జొన్నలగడ్డ గోవిందయ్య, పిన్నిక రత్తయ్య, వెంకటేశ్వర్లు, రవి, బారాషరీఫ్, పలువురు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

వెలిగండ్ల: జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోనేలా చేయాలని డీపీఓ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మొగళ్లూరు గ్రామ సచివాలయాన్ని డీపీఓ నారాయణరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించారు. ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువచేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ఎంపీపీ రామన మహాలక్ష్మి, ఎంపీడీఓ సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతరెడ్డి పాల్గొన్నారు.



మొగళ్లూరు సచివాలయంలో మాట్లాడుతున్న డీపీఓ నారాయణరెడ్డి

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేయాలని ఎంపీపీ కొండా బత్తిన మాధవరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులకు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. అందులో భాగంగానే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందజేయడానికి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. వైస్ ఎంపీపీలు అనుమోలు శివయ్య, దద్దాళి కృష్ణవేణి, ఎంపీడీఓ కల్పన, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు పారదర్శకంగా చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి రూరల్: గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం పారదర్శకంగా వ్యవహరించాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ బృందం చేపట్టే సోషల్ ఆడిట్‌పై సమన్వయ కమిటీ సమావేశం అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ సామాజిక తనిఖీ బృందం కచ్చితంగా గ్రామాల్లోకి వెళ్లి జరిగిన పనులు పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే నివేదికలు తయారు చేయాలన్నారు. డీవీఓ ఝాన్సీ రాణి మాట్లాడుతూ 512 పనులకు సంబంధించి రూ.7.80 కోట్ల నిధులు ఏఏ శాఖల్లో ఎంత జరిగాయనేది పనుల రికార్డులు, జరిగిన పనుల ఆధారాలను పూర్తి స్థాయిలో ఆడిట్ బృందానికి ఇవ్వాలని తెలిపారు. ఏపీఓ షారూన్, ఏఈ తిరుపాలు, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ సుమన్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.